
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 20 ఏప్రిల్ 2024



రెండోరోజు 10 నామినేషన్లు

● టీడీపీ అభ్యర్థులుగా రాయచోటిలో మండిపల్లి..
తంబళ్లపల్లెలో జయచంద్రారెడ్డి
● రైల్వేకోడూరులో జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్



నామినేషన్ వేస్తున్న రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



నామినేషన్ దాఖలు చేస్తున్న తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి



రైల్వేకోడూరులో నామినేషన్ వేస్తున్న జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 19: జిల్లాలో రెండోరోజు నామినేషన్ల ప్రక్రియ జోరందుకుంది. రెండోరోజు జిల్లావ్యాప్తంగా 10 నామినేషన్లు దాఖలయ్యాయి. రైల్వేకోడూరు ముక్కావారిపల్లెకు చెందిన అరవ శ్రీధర్ జనసేన పార్టీ తరఫున ఒక సెట్టు నామినేషన్ పత్రాలు ఎన్నికల అధికారికి ఇచ్చారు. రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నామినేషన్ పత్రాలు ఆర్డీవో రంగస్వామికి అందజేశారు. తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి, ఆయన భార్య కల్పనారెడ్డి టీడీపీ తరఫున తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి నామినేషన్ దాఖలు చేశారు. పీలేరు నుంచి నల్లారి అమర్‌నాథరెడ్డి నామినేషన్ వేశారు. రైల్వేకోడూరు కాంగ్రెస్ అభ్యర్థిగా కోశాలదేవి నామినేషన్ పత్రాలు ఎన్నికల అధికారి లీలారాణికి సమర్పించారు. మదనపల్లె టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందజేశారు. రాజంపేట పార్లమెంట్ స్థానానికి ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి తరఫున రాయలసీమ మైనార్టీ జనరల్ కో-ఆర్డినేటర్ షరీఫ్‌ఫక్రుద్దీన్, రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషాలు ఒక సెట్ నామినేషన్ పత్రాలు జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్‌కు అందజేశారు. అలాగే రాజంపేట పార్లమెంట్ స్థానానికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా రైల్వేకోడూరు మండలం ఓబనపల్లెకు చెందిన ఓబయ్యనాయుడు రెండు సెట్లు నామినేషన్ పత్రాలు జిల్లా ఎన్నికల అధికారికి సమర్పించారు. రాజంపేట పార్లమెంట్ స్థానానికి పీలేరు నియోజకవర్గం నుంచి కలడకు చెందిన ఆశాది వెంకటాద్రి నామినేషన్ వేశారు. మదనపల్లిలో భాస్కర్ అనే వ్యక్తి ఇండిపెండెంట్‌గా నామినేషన్ పత్రాలు వేశారు. రాయచోటిలో అసెంబ్లీకి కాంగ్రెస్ పార్టీ తరఫున అల్లాబకాష్ నామినేషన్ దాఖలు చేశారు.

సస్పెండైన ఉపాధ్యాయుడిపై విచారణ

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 19: స్థానిక జడ్పీ హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడుగా పని చేస్తూ సస్పెండైన్ అయిన గోపినాథ్‌పై శుక్రవారం స్కూల్లో విచారణ చేపట్టారు. కీచ కపర్వం నిర్వహించిన ఉపాధ్యాయుడు గోపి నాథ్‌పై ఏడీ ప్రసాద్‌బాబు, గర్ల్‌చైల్డ్ డిపార్ట్ మెంట్ రాధ శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారణ జరిపారు. స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులను, ఉపాధ్యాయులను, టీచర్ గోపినాథ్‌ను, విద్యార్థిని, వారి కుటుంబ సభ్యులను విచారించారు. విద్యార్థులకు పది ప్రశ్నలు రాయించి వారి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరి వద్ద సేకరించిన వివరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు పేర్కొ న్నారు. దీని ఆధారంగా ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటారని వివరించారు.

వటపత్రశాయికి వరహాల లాలి

● సింహవాహనంపై సీతారామలక్ష్మణుల అభయం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 19: కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు శుక్రవారం రాత్రి సీతారామలక్ష్మణులు సింహవాహనంపై భక్తులకు అభయమిచ్చారు. రాత్రి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామి వారిని కీర్తిస్తుండగా మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులకు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. శ్రీవారి దశావతారాల్లో నాల్గవది నరసింహావతారం కావడం.. సింహం గొప్పదనాన్ని తెలియజేస్తోంది. భక్తుడు సింహబలం అంతటి భక్తి బలం కలిగినప్పుడు భగవంతుడు అనుగ్రహిస్తాడని వాహన సేవలో అంతరార్థం. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ పాల్గొన్నారు.

వటపత్రశాయి అలంకారంలో..

కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు శుక్రవారం ఉదయం వటపత్రశాయి అలంకారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తజన బృందాలు, చెక్కభజనలు, కోలాటాలతో స్వామి వారిని కీర్తిస్తుండగా మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. పురాణాల ప్రకారం జలప్రళయం సంభవించినప్పుడు మహావిష్ణువు మర్రి ఆకుపై తెలియాడుతూ చిన్న శిశువుగా దర్శనమిస్తారు. కుడికాలి బొటన వేలిని నోటిలో పెట్టుకొని ఆస్వాదిస్తుంటారు. ఈ ఘట్టాన్ని గుర్తు చేస్తూ



మహావిష్ణువు అవతారమైన శ్రీరాముడు భక్తులకు కనువిందు చేశారు. భక్తుల కష్టాలను కడతేర్చేందుకు ఎప్పుడూ ముందుంటానని స్వామి వారు ఈ అలంకారం ద్వారా తెలియజేస్తున్నారు. వటపత్రశాయి మహిమను అన్నమయ్య తన సంకీర్తనల్లో చక్కగా వర్ణించారు. కోదండరాముని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు శనివారం ఉదయం నవనీత కృష్ణాలంకారం, రాత్రికి హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.





మహిళల కోలాటం... వటపత్రశాయి అలంకారంలో కోదండరాముడు

ప్రైవేట్ ఆస్పత్రిలో విరిగిపడ్డ లిఫ్ట్

ఎనిమిది మందికి గాయాలు







ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు... బాధితులను పరామర్శిస్తున్న రాంప్రసాద్‌రెడ్డి, సంఘటన జరిగిన ఆస్పత్రి

రాయచోటి టౌన్, ఏప్రిల్ 19 : రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో గల శ్రీవెంకటేశ్వర మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన లిఫ్ట్ విరిగిపడి 8 మందికి గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు... రాయచోటి పట్టణంతో పాటు చిన్నమండెం మండలం వండాడి ప్రాంతానికి చెందిన నరసింహులు, మల్లమ్మ, మల్లక్క, రెడ్డెమ్మలతో పాటు మరో నలుగురు శుక్రవారం రాత్రి వెంకటేశ్వర మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో తమ బంధువులను చూసేందుకు వెళ్లి లిఫ్ట్‌లో దిగుతుండగా ఒక్కసారిగా లిఫ్ట్ విరిగిపడటంతో అందులో ఉన్న 8 మంది గాయపడ్డారు. వెంటనే ఆస్పత్రి వైద్యులతో పాటు సిబ్బంది గాయపడ్డ వారికి అక్కడే వైద్య సేవలు అందించి గుట్టుచప్పుడు కాకుండా ఆటోలలో ఎక్కించి ఇళ్లకు పంపించారు. విషయం తెలుసుకున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆస్పత్రి వద్దకు వెళ్లి ఆటోలో వెళుతున్న బాధితులను పరామర్శించి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. ఈ విషయమై అర్బన్ పోలీసులను విచారించగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

తంబళ్లపల్లె నామినేషన్ కేంద్రం వద్ద ఉద్రిక్తత

● పోలీసులపై రాళ్లు విసిరిన గుర్తుతెలియని వ్యక్తి
● ట్రైనీ డీఎస్పీకి గాయం.. పోలీసుల లాఠీచార్జి



తంబళ్లపల్లె నామినేషన్ కేంద్రం వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

ములకలచెరువు, ఏప్రిల్ 19: తంబళ్లపల్లెలోని నామినేషన్ కేంద్ర వద్ద శుక్రవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తంబళ్లపల్లె నియోజకవర్గ కూటమి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి భారీ ర్యాలీగా నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చారు. ఆయన వెంట ప్రజలు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వచ్చారు. నామినేషన్ దాఖలు చేసేందుకు జయచంద్రారెడ్డి పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటుకుని ముందుకు వచ్చారు. ఆయన వెంట వచ్చిన వారు కూడా లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, టీడీపీ శ్రేణుల మధ్య తోపులాట జరగ్గా వెనుక నుంచి గుర్తుతెలియని వ్యక్తి రాయి విసిరాడు. దీంతో పోలీసులు లాఠీచార్జి చేయడంతో కొంతసేపు పరిస్థితి అదుపు తప్పింది. పోలీసులు లాఠీచార్జి చేయడంతో గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు విసిరారు. ఈ ఘటనలో ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్‌కు గాయమైంది. అలాగే వెనుక నుంచి గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు విసరడంతో ముందున్న పలువురు టీడీపీ కార్యకర్తలు కూడా గాయపడ్డారు. కొంతసేపటికి పరిస్థితి అదుపులోకి రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సుగవాసికి పెరుగుతున్న మద్దతు

● వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు ● పోలిసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున రాజంపేటలో ప్రచారం

రాజంపేట టౌన్, ఏప్రిల్ 19: రాజంపేట టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంకు అన్నివర్గాల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పెద్దఎత్తున ప్రచారాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఇటీవలే వైసీపీకి రాజీనామాలు చేసి నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులంతా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం రాజంపేట మండలంలో రాజంపేట నియోజకవర్గ టీడీపీ నాయకుడు పోలి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన పలువురు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర నేతలు పెద్ద ఎత్తున బాలసుబ్రమణ్యంకు బొకేలు ఇచ్చి పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా పోలి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని, అదే విధంగా ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా సుగవాసి బాలసుబ్రమణ్యం వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, స్వచ్ఛందంగా తనకు మద్దతు పలికి ప్రచారంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా సరస్వతీపురం, జానీబాషాపురం ప్రాంతంలో స్థానిక టీడీపీ నేత చిన్న ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పసుపులేటి సుధాకర్, మైనారిటీ నాయకులు షామీర్‌బాషా, మాజీ కౌన్సిలర్ పసుపులేటి సుధాకర్, వడ్డె శ్రీను, మన్నూరు మైనారిటీ నాయకులు జిలానీ, మామిళ్ల రవి, వజ్రవేలు, షామీర్‌బాషా, విశ్వనాథ ఆచారి, బీజేపీ నేత నాగోతు రమేశ్‌నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడె గన్నె సుబ్బనరసయ్యనాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు సంజీవరావు, టీడీపీ ప్రధాన కార్యదర్శి అబూబకర్, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్.వి.రమణ, దొంతం శివ, గుణవర్మ, మల్లికార్జున నాయుడు, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, లీగల్ సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మైనారిటీ నాయకులు కరీం, పీరు సాహెబ్, కరీముల్లా, జగన్, గునకల చిన్న తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి సరస్వతితో సుగవాసి భేటి

మాజీ మంత్రి సరస్వతితో సుగవాసి బాలసుబ్రమణ్యం శుక్రవారం రాత్రి భేటి అయ్యారు. రాజంపేట పట్టణంలోని ఆమె స్వగృహానికి వెళ్లి ఎన్నికల్లో తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సుగవాసి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు నేతలతో సుగవాసి మంతనాలు

రాజంపేటలోని పలువురు నేతలతో టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం మంతనాలు జరుపుతున్నారు. తెల్లవారుజామున 5 గంటలకే లేచి తన రాజకీయ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. రాత్రి 12 గంటలకు పైబడి కూడా ఈ మంతనాలను సాగిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో బలమైన నేతలను, సామాజికపరమైన నేతలను, గతంలో పదవుల్లో ఉన్న వారిని ఇలా అనేక మంది నేతలను కలిసి వారి మద్దతు కోరుతున్నారు. ఇందులో భాగంగానే రాజంపేటలోని ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ దగ్గుపాటి నవీన్, డాక్టర్ గాయత్రి, మాజీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, కూచివారి పల్లె నాయకులు నెట్టెం శ్రీరాములునాయుడు తదితరులతో ఆయన చర్చలు జరిపి వారి మద్దతు కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ నవీన్ మాట్లాడుతూ తాను వృత్తిపరంగా, సామాజికపరంగా అందరికీ తెలిసినవాడినని. తమకు తెలిసిన ప్రదేశాల్లో ప్రచారం చేసి సుగవాసి గెలుపునకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా సుగవాసిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, నవీన్‌చంద్ర కల్యాణ మండప అధినేత దగ్గుపాటి చంద్రశేఖర్ బాబు, మాజీ ఎంపీటీసీ గుడారు సుబ్రమణ్యం, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బాసినేని వెంకటేశ్వర్లనాయుడు, జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పట్టణ మాజీ టీడీపీ అధ్యక్షుడు సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.



రాజంపేటలో పోలి సుబ్బారెడ్డితో కలిసి ప్రచారం చేస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

జనసేన కార్యాలయంలో ఆత్మీయ సమావేశం

రాజంపేట జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మలిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ తమ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులకు తమ సంపూర్ణ మద్దతు పలుకుతున్నామన్నారు. వారి గెలుపునకు కృషి చేస్తామన్నారు. రాజంపేట అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని, అదేవిధంగా ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ మలిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో జనసైనికులంతా తమ కు మద్దతు పలకడం ఆనందదాయకమని ఈ సందర్భంగా ఆత్మీయ సమావేశం జరపడం సంతోషంగా ఉం దని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకు లు పోలిశెట్టి శ్రీనివాసులు, గన్నె సుబ్బనరసయ్యనాయు డు, మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఎద్దల విజయసాగర్, టీడీపీ నాయకులు, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్.వి.రమణ, చేనేత కార్మికుల కార్యదర్శి రాటాల రామయ్య, జనసేన లీగల్ సెల్ అధ్యక్షుడు కత్తి సుబ్బరాయుడు, భాస్కర పంతులు తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లెలో ప్రసాద్‌బాబు పర్యటన

సుండుపల్లె, ఏప్రిల్ 19: రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సుగవాసి బాలసుబ్రమణ్యంను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌బాబు కోరారు. శుక్రవారం సుండుపల్లె మండలంలో ప్రచారం చేశారు. టీడీపీ కార్యాలయంలో టీడీపీ శ్రేణులతో కలిసి సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలే టీడీపీకి బలమని, నెల రోజులు కష్టపడి పనిచేస్తే అందరికీ మంచి రోజులు వస్తాయన్నారు. అనంతరం పెద్దబలిజపల్లెలో సీతారాముల కల్యాణానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బలిజ సంఘం నాయకులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, చప్పిడి రమేశ్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రాజు, గ్రామ అధ్యక్షులు సుబ్బరామ్, వెంకట్రమణ, రామాంజులు, యూనియన్ బాషా, చంద్రశేఖర్‌రాజు, మాజీ ఎంపీటీసీలు మోహన్ రావు, నంద్యాల రామయ్య, చంద్ర, జనసేన మహిళా నాయకురాలు రెడ్డిరాణి తదితరులు పాల్గొన్నారు.



సుండుపల్లెలో ప్రచారం చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌బాబు

ఒంటిమిట్టలో..: రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి సుబ్రమణ్యంను ఆదరించాలని మాజీ టీడీపీ బోర్డు మెంబర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. శుక్రవారం మండల వ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలను కలిసి అభ్యర్థించారు. ఉమ్మడి అభ్యర్థుల నాయకత్వాన్ని బలపరచాలన్నారు. కొత్తమాధవరం, కొండమాచుపల్లి, ఒంటిమిట్ట, మలకాటిపల్లె, సాలాబాదు గ్రామాల్లో స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులను కలిసి తమకు మద్దతు తెలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గజ్జల నరసింహారెడ్డి, కొమరా వెంకటనరసయ్య, పామూరు సుబ్రమణ్యం, కాంట్రాక్టర్ రమణ, చింతగింజల సుబ్రమణ్యం, మావిళ్ల శ్రీహరి, బొబ్బిలి రాయుడు, బొడిచెర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

తండ్రి కోసం తనయుడు...

సిద్దవటం, ఏప్రిల్ 19: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని రాజంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం తనయుడు జానకిరామ్ తెలిపారు. సిద్దవటం మండలం టక్కోలి, కాజీపల్లి మూలపల్లెల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలంటూ విస్తృత ప్రచారం చేపట్టారు. మూలపల్లెలో వైసీపీకి చెందిన 20 కుటుంబాల వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జానకిరామ్ మాట్లాడుతూ సుగవాసి బాలసుబ్రమణ్యంను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు శనివారపు మోహన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి దశరధరామనాయుడు, సింగిల్‌విండో అధ్యక్షుడు జ్యోతి జగదీశ్వర్‌రెడ్డి, రాజంపేట తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు రాజానాయుడు, బజాజ్ షోరూం అధినేత అయ్యప్పనాయుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చలమయ్య యాదవ్, తెలుగుదేశం పార్టీ పార్లమెంటు కార్యదర్శి నాగమునిరెడ్డి, టీడీపీ సీనియర్ నేత శంకర్‌రెడ్డి, ఉప్పరపల్లె తెలుగుదేశం నాయకుడు శివప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో కూటమి ప్రచారం

నందలూరు, ఏప్రిల్ 19: మండలంలోని పాటూరు పంచాయతీలో శుక్రవారం ఉదయం ప్రారంభమైన జనసేన, బీజేపీ, టీడీపీ కూటమి ప్రచారం భారీ ఎత్తున జరిగింది. రాజంపేట పార్లమెంటు ఎన్నికల సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు. ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యమని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. మాజీ సర్పంచ్ ఖాదర్‌బాషా, పోలి సుబ్బారెడ్డి, ఆర్టీసీ మాజీ రీజనల్ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, మాజీ జెడ్పీటీసీ యల్లటూరు శివరామరాజు, మాజీ జెడ్పీ కో-ఆప్షన్‌సభ్యులు షబ్బీర్ అహమ్మద్, మాజీ అగ్రికల్చరల్ మార్కెట్ చైర్మన్ ఎద్దల సాగర్, మాజీ ఎంపీపీ లక్ష్మీనరసయ్య, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, ఎల్లయ్య, డాక్టర్ అరిగె రాంప్రసాద్, సిద్దవరం మురళీధర్‌రెడ్డి, ఆదినారాయణ, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ నూకల రమేష్, శంకర రాజు, తోట శ్రీను, శివరామరాజు, రమేష్, పులి నరసింహ, ప్రశాంత్ భారతాల, ఆకుల చలపతి, బాబు, సయ్యద్ అమీర్, శ్రీను మద్దెల, వెంకటరమణ గౌడ్, కృష్ణయ్య, వెంకటసుబ్బయ్య, మహేష్, మహిళా నాయకురాలు వాణి పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



బాలసుబ్రమణ్యంను సత్కరిస్తున్న డాక్టర్ నవీన్, గాయత్రి దంపతులు



సుగవాసి బాలసుబ్రమణ్యంకు మద్దతు పలుకుతున్న జనసేన ఇన్‌చార్జి మలిశెట్టి వెంకటరమణ



నందలూరులో ప్రచారం చేస్తున్న బాలసుబ్రమణ్యం, శ్రీనివాసరాజు, తుంగా రమణయ్య, పోలి సుబ్బారెడ్డి



మాజీ మంత్రి సరస్వతితో భేటీ అయిన సుగవాసి బాలసుబ్రమణ్యం

ఎమ్మెల్యేకి రూ.40 లక్షలు.. ఎంపీకి రూ.95 లక్షలు

- అంతకంటే వ్యయం మించకూడదు
- జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 19: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయం రూ.40 లక్షలకు మించరాదని, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయం రూ.95 లక్షలకు మించరాదని ఎన్నికల వ్యయ పరిశీలకులు రవీందర్ కుమార్, ఎస్‌జీ మూన్, వైభవ్ శుక్ల తెలిపారు. భారత ఎన్నికల సంఘంచే జిల్లాకు నియమితులైన వారు శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జిల్లా ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కమిటీ, ఎంసీఎంసీ కమిటీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ కమిటీలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి ఎన్నికల నిర్వహణ నియమాలు-2022లోని నియమం 90 ప్రకారం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థుల వ్యయం రూ.40 లక్షలకు మించరాదని లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థుల వ్యయం రూ.95 లక్షలకు మించరాదని తెలిపారు.

జిల్లా ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కమిటీ, జిల్లాలో అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు పోటీ చేయబోయే అభ్యర్థుల వ్యయాన్ని ప్రతిరోజూ పరిశీలించి రోజువారి నివేదికను వారికి పంపాలన్నారు. అభ్యర్థి నామినేషన్ వేసిన దగ్గర నుంచే అతడి ఖాతాల్లో ఖర్చు నమోదు చేయాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి అభ్యర్థుల వ్యయాన్ని లెక్కించాలని సూచించారు. సమావేశంలో పార్లమెంట్, 6 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన వ్యయ కమిటీ సభ్యులు, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్‌టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభ్యర్థుల ఖర్చులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలి

- వ్యయ పరిశీలకుడు కేఎస్ రమేష్‌భారతి




అకౌంట్ సిబ్బంది, నోడల్ అధికారులతో మాట్లాడుతున్న వ్యయ పరిశీలకులు కేఎస్ రమేష్‌భారతి

పులివెందులటౌన్, ఏప్రిల్ 19: సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల ఖర్చులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని కడప పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు కేఎస్ రమేష్‌భారతి (ఐఆర్ఎస్) ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని ఆర్వో కార్యాలయంలో అకౌంట్ సిబ్బంది, నోడల్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషనల్ దాఖలు చేసిన నాటికి అభ్యర్థుల ఖర్చులను లెక్కించాలన్నారు. ఎంపీ అభ్యర్థికి రూ.95 లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థికి రూ.40 లక్షలు నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి ఎలక్షన్ ముగిసే వరకు తెలియజేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌లోని అన్ని విభాగాలను వారు పరిశీలించారు. 1950 కాల్ సెంటర్ హెల్ప్ డెస్క్, సువిధ, వెబ్‌కాస్టింగ్ తదితర వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ వెంకటేశులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నేతల ఇసుక దందా

- పెన్నానదిని గుల్ల చేసిన మాఫియా
- వాటర్ వర్క్స్‌కు సమీపంలోనే తవ్వకాలు
- ఎన్నికల విధుల్లో రెవెన్యూ, పోలీసు అధికారులు
- ఇదే అదునుగా చెలరేగిపోతున్న ఇసుకాసురులు
- రాత్రి, పగలు వందలాది ట్రాక్టర్లతో రవాణా
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



అక్రమ తవ్వకాలతో నదిలో ఇసుక మేటలు మాయమైపోయిన దృశ్యం

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 19: వైసీపీ అధికారంలోకి వచ్చిన ఈ ఐదేళ్లలో ప్రొద్దుటూరులో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునే అధికారులే లేరని పలువురు విమర్శిస్తున్నారు. అధికార పార్టీ ముఖ్యనేత, ఆయన కుటుంబ సభ్యులే నేరుగా ఇసుక దందాను సాగించారని పలు ఆరోపణలున్నాయి. స్వంత టాక్టర్లు పెట్టుకొని రోజువారి అక్రమ ఆదాయ మార్గంగా ఇసుక రవాణాను మార్చుకొని ఈ ఐదేళ్ల నిరాటంకంగా కొనసాగించారని చెబుతారు. దీంతో ఇసుకదందాలో వచ్చిన కోట్ల రూపాయల డబ్బు ఈ ఎన్నికల్లో ప్రభావితం చేయనున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇసుక తవ్వకాలతో తాగునీటికి డేంజర్ బెల్స్

ప్రొద్దుటూరు మండలంలోనే ఎక్కడా ఇసుక క్వారీకి ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదు. ఇప్పటికే మండల పరిధిలో పారుతున్న పెన్నానదిలో ఇసుక తవ్వకాలు జోరుగా జరిపి పెన్నానదిలో పూర్తి స్థాయిలో ఇసుక మేటలు అంతరించిపోయాయి. చాలా చోట రాళ్ల బయటకు తేలాయి. దీంతో మూడు లక్షల జనాభా గల ప్రొద్దుటూరు నియోజకవర్గ వాసుల తాగునీటికి ఈ పెన్నా రివర్ బెడ్డే దిక్కు. ఐదేళ్లలో సాగించిన ఇసుక తవ్వకాల వల్ల రాబోవు రోజుల్లో ఇక్కడ నీటి కష్టాలు తప్పవని వాటర్‌వర్క్స్ అధికారులు హెచ్చరిస్తున్నారు. మైలవరం రిజర్వాయర్లో ఇప్పటికే నీళ్ల అడుగంటాయి. ఈ సారి వర్షాలు రాకపోతే తీవ్రమైన తాగునీటి ఎద్దడి తప్పదు. రివర్‌బెడ్‌లో వుండే తాగునీటి బోర్లు ఇసుక తవ్వకాలతో భూగర్భజలాలు తగ్గిపోతున్నాయి.

వైసీపీలో చేరిన వారికి దందాలో చోటు

ప్రొద్దుటూరు పరిసర ప్రాంతంలో పెన్నానదిలో డేంజర్‌బెల్స్ ఎప్పుడో మోగించినా ఇక్కడ వైసీపీకి అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే ఈ దందాను మూడు పూలు ఆరు కాయలుగా సాగించింది. తాము అధికారంలో వున్నప్పుడే ఇళ్ల చక్కపెట్టుకోవాలనే చందంగా రాత్రి, పగలు ఇసుక దోపిడీకి తెగబడ్డారు. దాదాపు వందల కోట్లు ఇసుక అక్రమ రవాణాలోనే ఆర్జించారు. దీనికి తోడు తమ వెంటనడిచే అనుచర గణానికి డ్రైవర్లకు, ప్రైవేటు గన్‌మెన్‌లకు పార్టీలో చేర్చుకునే చోటమోటా నేతలందరికి ఆదాయ మార్గం ఇసుక ట్రాక్టర్లు పెట్టుకుని ఇసుక దందా నడుపుకోవడానికి ఆదాయ మార్గంగా చూపారు. దీంతో ఇసుక అక్రమ రవాణా ద్వారా రోజు వేలాది రూపాయల సంపాదనతో అధికార వైసీపీలో పెద్ద ఎత్తున కార్యకర్తలుగా తిరుగుతున్నారు.

ఎన్నికల విధుల్లో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం

ఎన్నికల విధుల్లో రెవెన్యూ పోలీసు యంత్రాంగం నిండా మునిగి వుండటంతో ఇదే అదనుగా వైసీపీ అనుచర ఇసుక మాఫియా పెద్ద ఎత్తున మండల పరిధిలోని చౌడూరు నుంచి పెద్దశెట్టిపల్లె, రామాపురం, దొరసానిపల్లె, రామేశ్వరం వాటర్‌వర్క్స్ వద్ద, ఆర్‌టీపీపీ రోడ్డు, ముక్తియార్ ఆయిల్ మిల్లు ఏరియా, ఎర్రగుంట్ల రోడ్డులోని అయప్ప స్వామి దేవళం వద్ద కల్లూరు తాళ్లమాపురం గ్రామాల పరిధిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నది.

చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

ఇసుక అక్రమ రవాణాలను అరికట్టే విధుల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్), సివిల్ పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అండ్ జియాలజీ అధికారులు, ఇరిగేషన్ అధికారులందరికి ఇసుక తవ్వకాలను అక్రమ రవాణాను అడ్డుకునే అధికారాలు వున్నాయి. కానీ ఈ యంత్రాంగం అంతా చోద్యం చూస్తుండటం కొందరు అధికారులకు నెల మామూళ్లు వుండగా ఆఖరికి బ్లూకోల్ట్ టీంలకు కూడా ట్రాక్టర్‌కు రూ.500 వంతున ఇసుక మాఫియా అందజేస్తున్నట్లు సమాచారం.

ఎన్నికల ఖర్చులకు ఇసుక దందా డబ్బు

అధికార వైసీపీకి చెందిన నేతలకు ఈ ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బులు ఖర్చుచేయడానికి ఇసుక దందా డబ్బు పెద్ద ఎత్తున బయటకు తీస్తున్నట్లు సమాచారం. దీనికి తోడు ప్రతిపక్ష పార్టీలో చోటా మోటా నేతలందరికి గాలం వేయడానికి సైతం ఈ డబ్బు పెద్ద ఎత్తున ఆశచూపి పార్టీలోకి తీసుకుంటున్నట్లు ఆ వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. రోజు పెద్ద ఎత్తున అక్రమ ఆదాయ మార్గంగా వుండే ఇసుక రవాణాను మాత్రం నిరాటంకంగా కొనసాగిస్తున్నారు.



పెన్నానది నుంచి జోరుగా రవాణా సాగిస్తున్న ఇసుక టాక్టర్లు

ఎన్నికల విధులున్నా ఇసుక దోపిడీని అరికడతాం

- మురళీధర్, డీఎస్పీ, ప్రొద్దుటూరు



ఎన్నికల విధుల్లో వున్నా అసాంఘిక నేరా లను అరికట్టే బాధ్యత మాదే. పెన్నా నదిలో ఇసుక దోపిడీని అరికట్టడానికి బ్లూకోల్ట్ టీంలు పెడతాం. సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులు సైతం వారి దృష్టికి వస్తే ఇసుక టాక్టర్లను పట్టుకుంటు న్నారు. కేసులు కూడా నమోదవుతు న్నా యి. సివిల్ పోలీసులకు లా అండ్ ఆర్డర్ ప్రధానంగా వుంటుంది. ఇసుక, గుట్కా, మద్యం కోసం ప్రత్యేకంగా సెబ్ వుంది.



పోటోలు తీస్తుంటే ముఖాలకు చేతులు అడ్డం పెట్టుకుంటున్న దృశ్యం

నన్ను క్షమించండి

- మళ్లీ కేసుల కోసం కోర్టుల వెంట తిరిగే పరిస్థితి తెస్తున్నారు
- ఓటు అడిగేందుకు మీదగ్గరకు నేను రాలేకపోతే...
- వైఎస్ షర్మిలకు ఓటు వేసి గెలిపించండి : సునీత



విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ సునీత

పులివెందుల, ఏప్రిల్ 19: "ప్రజలందరూ జరుగుతున్న పరిస్థితులను గమనిస్తున్నారు. మీఅందరి దగ్గరికి ఓటు అడిగేందుకు నేను రాలేకపోతే నన్ను క్షమించండి.. వైఎస్ షర్మిలకు ఓటు వేసి గెలిపించండి" అని మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీత పేర్కొన్నారు. శుక్రవారం పులివెందుల పట్టణంలో ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆమె విలేకరులతో మాట్లాడారు.
గడచిన ఐదేళ్లుగా న్యాయం కోసం పోరాటం సాగిస్తున్నా అన్నారు. పులివెందుల ప్రజలందరికీ ఈ విషయం తెలుసన్నారు. ఐదేళ్లలో ఐదుసార్లు కూడా తాను మీడియా ముందుకు రాలేదన్నారు. రెండు నెలలుగా తమకు జరిగిన అన్యాయాన్ని మీముందుకు తెస్తున్నా అన్నారు. ఐదు సంవత్సరాలలో ఎవరెన్ని మాటలు మాట్లాడారో ఎవరు ఎంత చేశారో, నాన్నను ఎంత అవమానించారో మీ అందరికి తెలుసు అన్నారు. అయినా కూడా తాను నోరుమెదప లేదన్నారు. తనకు న్యాయం చేయాలని ప్రజల ముందుకు వచ్చేసరికి మళ్లీ కేసులు పెడుతున్నారన్నారు. దీంతో మళ్లీ కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. మనకున్నది కేవలం మూడు వారాల సమయం మాత్రమే అన్నారు. ఇటువంటి పరిస్థతుల్లో మీ ముందుకు వచ్చి ఓటు అడగకపోతే తనను మన్నించాలని అన్నారు. తనకు న్యాయం జరిగేందుకు వైఎస్ షర్మిలను హస్తం గుర్తుపై ఓట వేసి గెలిపించాలని ప్రార్థిస్తున్నా అన్నారు. మురారిచింతల గ్రామంలో ఒక వ్యక్తిని వైసీపీ వారు చితకబాదారన్నారు. పులివెందులలో ప్రజాస్వామ్యం ఉందా? ఏం చేస్తున్నారు వీరు అని ప్రశ్నించారు. ప్రజలకు నచ్చిన విధంగా వారు ఉండేందుకు కూడా అవకాశం లేదా అన్నారు. ప్రజా స్వామ్యంలో ఎవరికి నచ్చిన విధంగా వారు ఉండేందుకు అవకాశం ఉందన్నారు. ప్రజలే జరుగుతున్న విషయాలను గమనించి షర్మిలకు ఓటు వేయాలని డాక్టర్ సునీత కోరారు.

వైసీపీలో అన్యాయం జరిగిందని..

- ఎన్డీయే కూటమిలోకి వెళ్లేందుకు సిద్ధం
- ఎమ్మెల్సీ వర్గీయుల సమావేశం



ఎస్.ఉప్పలపాడు గ్రామంలో సమావేశమైన ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వర్గీయులు

జమ్మలమడుగు, ఏప్రిల్ 19: జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వర్గీయులు అసంతృప్తిలో ఉన్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన తర్వాత నుంచి ఆయన వర్గీయులకు కష్టాలు ప్రారంభమైనట్లు పలువురు నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగా జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో మాజీ తుంగభద్ర హెచ్ఎల్‌సీ ఛైర్మన్ ఉప్పలపాడు శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో మైలవరం, జమ్మలమడుగు ప్రాంతానికి చెందిన రామసుబ్బారెడ్డి వర్గీయులు శుక్రవారం ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మైలవరం మండలానికి చెందిన వద్దిరాల, గొల్లపల్లె, అనంతరాయునిపేట, నవాబుపేట, కర్మలవారిపల్లె, ఎస్.ఉప్పలపాడు గ్రామం, వేపరాల, కల్లుట్ల, దొమ్మరనంద్యాల, తదితర గ్రామాల నేతలు సమావేశంలో పాల్గొన్నారు. వైసీపీ పాలనలో రామసుబ్బారెడ్డి వర్గీయులకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తీవ్ర అన్యాయం చేశారని, తాము ఏదైనా సమస్య కోసం వెళ్లినప్పుడు మీరు తనకు ఓటు వేయలేదని.. గతంలో రామసుబ్బారెడ్డికి ఓట్లు వేశారని తదితర విమర్శలు చేశారని చెప్పుకున్నట్లు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో ఇప్పటికే ఆ వర్గమంతా పూర్తి అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. అయితే ఇటీవల మైలవరం మండలంలోని ఓ గ్రామం వద్ద రామసుబ్బారెడ్డి, సుధీర్‌రెడ్డిలు ప్రచార కార్యక్రమంలో వెళ్లినప్పుడు కార్యకర్తలు, నాయకుల విషయంలో మాటా మాటా పెరిగిందని, ఆ రోజు నుంచి రామసుబ్బారెడ్డి వర్గీయులంతా పూర్తి అసంతృప్తిలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికలకు రామసుబ్బారెడ్డి, అలాగే ఎంపీ అభ్యర్థి అవినాష్‌రెడ్డి వద్దకు వెళ్లి తమకు న్యాయం జరిగితే ఉంటామని, లేనిపక్షంలో ఎన్డీయే కూటమిలోకి వెళ్లిపోతామని శ్రీనివాసులరెడ్డి వద్ద పలువురు నేతలు చెప్పినట్లుగా తెలుస్తోంది. ఏదేమైనా సుమారుగా మైలవరం మండలంలో 25 మంది ఆయా గ్రామాలకు చెందిన నాయకులు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. దీంతో వైసీపీ నాయకుల్లో కొంతవరకు భయం పుట్టుకొచ్చినట్లుగా తెలుస్తోంది.

వ్యక్తిపై దాడి..

- 11 మందిపై కేసు నమోదు

పులివెందుల, ఏప్రిల్ 19: లింగాల మండలంలోని మురారి చింతల గ్రామంలో చలమారెడ్డి అనే వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో బాబ్‌జాన్‌తో పాటు మరో పది మందిపై కేసు నమోదు చేసినట్లు లింగాల ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. గురువారం చలమారెడ్డి అనే వ్యక్తి బాబ్‌జాన్ కుటుంబ సభ్యులలో ఒకరిని టీడీపీలో చేర్పించేందుకు ప్రయత్నించాడన్నారు. దీతో బాబ్‌జాన్ మరో పది మంది కలిసి చలామారెడ్డిపై దాడి చేశారన్నారు. ఈ ఘటనలో వారందరిపై కేసు నమోదు చేశామన్నారు.



నిర్మానుష్యంగా ఉన్న కోటిరెడ్డి కూడలి



నిర్మానుష్యంగా ఉన్న ఏడురోడ్ల కూడలి



ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న చిరువ్యాపారులు



ఎండ ప్రచండం

- భానుడి భగభగలతో బెంబేలెత్తుతున్న ప్రజలు

కడప (సెవెన్‌రోడ్స్), ఏప్రిల్ 19: వేసవి కాలం ఆరంభం నుండే భానుడి ప్రతాపంతో ఎండలు మండుతున్నాయి. సూర్యోదయం నుంచి భానుడి భగభగలతో సెగలు కక్కుతు న్నాయి. ఉదయం 8 నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో జనం బయ టకు అడుగు పెట్టాలంటే జంకుతున్నారు. ఎండల ధాటికి చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ అవస్థలు పడుతున్నారు. స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు మొదలుకొని వృద్ధులు, అనారోగ్య బాధితులు, దినసరి కూలీలు, కార్మికులు, ఉద్యోగస్తులు ఇలా ప్రతి ఒక్కరు వేసవి తీవ్రతతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక భానుడి ప్రతా పానికి పశుపక్ష్యాదులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఇక ఇంట్లో ఉక్కపోత, బయట తిరిగితే వడగాల్పులతో జనం జంకుతున్నారు. విధిలేని పరిస్థితుల్లోనే బయటకు వెళ్లాల్సి వచ్చినా మధ్యాహ్నం 12 గంటల లోపే ఇళ్లకు చేరుకుంటున్నారు. దీంతో కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, బద్వేలు, జమ్మల మడుగు లాంటి నగరాల్లో జనాలు లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఇక జిల్లాలో శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే... సింహాద్రిపురం 45.6, ఖాజీపేట 45.1, చాపాడు 44.3, ప్రొద్దుటూరు 44.2, కడప, పెండ్లిమర్రి 43.7, జమ్మలమడుగు 43.6, కలసపాడు 43.4, ఎర్రగుంట్ల 43.3, తొండూరు 43.2 ముద్దనూరు 43.1 బి.కోడూరు 42.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఆటో దగ్ధం

కడప నగరంలోని సంధ్యా సర్కిల్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఆటో స్టాండ్‌లో ఉన్న ఓ ఆటో ఎండధాటికి కాలిపోవడం తీవ్ర బయాందోళనకు దారీ తీసింది. ఆటో స్టాండులో ఆటోను ప్యాసింజర్ల కోసం ఉంచారు. ఆటో డ్రైవర్ బయట ఉన్నారు. ఎండ వేడిమికి ఒక్కసారిగా మంటలు చెలరేగి ఆటో దగ్ధం అయ్యింది. ఆ సమయంలో ఆటోలో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అదే సమయంలో డీసీసీ బ్యాంకు ఎదురుగా ఉన్న ఒక హోటల్‌లో మంటలు చెలరేగాయి. ఈ సంఘటనలను బట్టి జిల్లాలో ఎండులు ఎలా మండుతున్నాయో అర్థం అవుతుంది.



ఎండ వేడిమికి కడప నగరం సంధ్యా సర్కిల్‌లో మంటలకు దగ్ధమవుతున్న ఆటో






జన్మదిన శుభాకాంక్షలు
75 ఏళ్ళ వయసులోను పాతికేళ్ళ యువకుడిలా
తెలుగురాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం అలుపెరుగని యోధుడుగా
అహర్నిశలు శ్రమిస్తున్న మాన్యశ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి జన్మదిన శుభాకాంక్షలు.
అకుంఠిత దీక్షాదక్షతలతో రాజకీయాల్లో అపర చాణక్యుడయి విరాజిల్లుతున్న
మహా నాయకుడా..! వర్థిల్లు వెయ్యేళ్ళు యశోకీర్తి చంద్రికల కిరీట ధారివై
దగ్గుబాటి వెంకటేశ్వర రావు
తెలుగుదేశం పార్టీ నాయకులు, పీలేరు నియోజకవర్గం
చి॥ నారా దేవాన్ష్
చి॥ నల్లారి
ఆర్యవన్ రెడ్డి

ఫిర్యాదు చేసేందుకు వెళితే.. గ్రామంలోకి రావద్దంటున్నారు

● కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు మహిళల యత్నం



మహిళలతో మాట్లాడుతున్న రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 19: అత్యాచారయత్నం చేసిన వ్యక్తిపై ఫిర్యాదు ఇచ్చేందుకు వెళ్లిన తమను గ్రామంలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారంటూ పలువురు మహిళలు శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు యత్నించారు. . వివరాలు ఇలా ఉన్నాయి. సంబేపల్లె మండలం నాగిరెడ్డిగారిపల్లె పంచాయతీ గోరవాండ్లపల్లెకు చెందిన ఓమహిళపై గత మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో చలపతి నాయుడు అనే వ్యక్తి మద్యం మత్తులో అత్యాచారయత్నం చేశాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారు అక్కడికి వెళ్లగా, వారిపై రాళ్లతో దాడి చేశాడు. ఈ దాడిలో బత్తల కళావతి, ఇంద్రజ అనే మహిళలు గాయపడ్డారు. దీంతో వారు సంబేపల్లె పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా వారు సైతం నిందితుడికి అనుకూలంగానే మాట్లాడు తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు తాము గ్రామంలోకి ఎలా వస్తారో చూస్తానంటూ నిందితుడు బెదిరిస్తున్నాడని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టరుకు ఫిర్యాదు చేసేందుకు వచ్చామని మహిళలు తెలిపారు. కలెక్టర్ కార్యాలయం ముందు టెంట్లు వేసి ధర్నా చేయడానికి వీలు లేదంటూ రాయచోటి అర్బ న్ సీఐ సుధాకర్‌రెడ్డి వారికి నచ్చజెప్పి పంపించేశారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

రామాపురం, ఏప్రిల్ 19: త్వరలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రామాపురం మండలం కొత్త రోడ్డు నారాయణపురం పోలీస్‌చెక్‌పోస్టు వద్ద శుక్రవారం సాయంత్రం వాహనాలను ఎన్నికల పరిశీలకుడు ఎస్‌జీ మున్నా, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రంగస్వామి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో సుబ్బారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

21న ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష

రామాపురం, ఏప్రిల్ 19: రామాపురం ఏపీ ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశానికి ఈ నెల 21వ తేదీన ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌ఎండీ అఫ్రోజ్‌బేగం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ ఆరవ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్ తీసుకొని పరీక్ష రోజున ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. ప్రవేశ పరీక్ష ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రేరణ ఉత్సవాలు



జిల్లా స్థాయి ప్రేరణ కార్యక్రమంలో విద్యార్థులు

రాజంపేట టౌన్, ఏప్రిల్ 19 : రాజంపేట జవహర్ నవోదయ విద్యాలయంలో శుక్రవారం జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవాలు నిర్వహించారు. గుజరాత్‌లోని వాద్ నగర్ ప్రాంతానికి చెందిన 10 మంది విద్యార్థినులు మన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పది మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెయింటింగ్, వక్తృత్వ, వ్యాస రచనత ్దితర అంశాలపై పోటీలు నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా, రాష్ట్ర స్థాయి ప్రేరణ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి, నవోదయ ప్రిన్సిపాల్ గీత, మాని టరింగ్ అధికారి రామకృష్ణ, ఎంఈవో చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రాలయంలో రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో భద్రకాళీ అమ్మవారు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 19: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయమ్మ, ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి పర్యవేక్షించారు. ఆలయ ప్రధాన అర్చకుడు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

అభివృద్ధికి నోచుకోని రహదారి

● రెండు దశాబ్దాలుగా పట్టించుకోని నేతలు ● నత్తనడకన అండర్ బ్రిడ్జి పనులు



వర్షాకాలం లో నీటి మడుగులా మారిన రోడ్డు (ఫైల్)



నత్తనడకన సాగుతున్న అండర్ బ్రిడ్జి పనులు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 19: అది 25 గ్రామాలకు ప్రధాన రహదారి. ఆటోలు, కార్లు, జీపులతోపాటు, బెరైటీస్, ఉద్యాన ఉత్పత్తులను తరలించే భారీ వాహనాలు సైతం నిరంతరం తిరుగుతుంటాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న రోడ్డును 20 ఏళ్లుగా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఈ రహదారిపై ప్రయాణం ప్రాణాంతకంగా మారింది.

రైల్వేకోడూరు రైల్వేస్టేషన్ నుంచి ఎన్‌ఫోర్సుమెంట్, అగ్నిమాపక కేంద్రం. కోర్టు, పాత తహసీల్దార్ కార్యాలయం మీదుగా సమతానగర్, కె.బుడుగుంటపల్లె, అయ్యవారిపల్లె, తాడివారిపల్లె, దేశెట్టిపల్లె, వీపీఆర్ కండ్రిక, ఎస్ఆర్ కండ్రిక, దళితవాడలు, గిరిజన కాలనీలకు వెళ్లే ప్రధాన రహదారి దాదాపు రెండు దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురవుతోంది. ఈ మార్గంలోనే పలు హాస్టళ్లు, జూనియర్ కాలేజి, డిగ్రీ కాలేజ, పల్వరైజింగ్ మిల్లులు, రైల్వే క్వార్టర్స్, వ్యవసాయ భూములు ఉన్నాయి. దీంతో వ్యవసాయ, పల్వరైజింగ్ మిల్లు కార్మికులు, రైతులు, విద్యార్థులు, భవన నిర్మాణ కార్మికులు, చేతి వృత్తుల వారు, ఉద్యోగులు తదితరులు ఈ మార్గం నుంచి రైల్వేకోడూరుకు రావాల్సి ఉంది. 20 ఏళ్లుగా ఈ రోడ్డు నిర్లక్ష్యానికి గురవడంతో గులకరాళ్లు తేలాయి. దీంతో పంక్చర్లు కావడంతోపాటు, వాహనాలు దెబ్బతింటున్నాయని, ప్రమాదాలు అధికమవుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డులోని గుంతల కారణంగా ఉద్యాన ఉత్పత్తులు ఎగుమతి చేసే రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బెరైటీస్ వాహనాల సంచారంతో రోడ్డు తరచూ దెబ్బతింటోంది. ప్రభుత్వ మార్కెట్ యార్డుకు సైతం ఇదే మార్గంలో వెళ్లాల్సి రావడంతో రైతులు అక్కడికి వెళ్లడమే మానేసి, ప్రైవేటు మార్కెట్ యార్డుకు పంట ఉత్పత్తులను తీసుకుపోతున్నారు. దీంతో మార్కెట్ యార్డు అభివృద్ధి ఆగిపోయింది. ఈ మార్గంలో రైలు పట్టాలు దాటి వెళ్లాల్సి రావడంతో విద్యార్థులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. కాగా, ఈ ప్రాంతంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి సుమారు రూ.10 కోట్లు నిధులు మంజూరు అయ్యాయంటూ ఎన్నికల నోటిఫికేషన్ రాక మునుపు స్థానిక ప్రజాప్రతిధి ఆగమేఘాల మధ్య భూమి పూజ చేశారు. ఆ తర్వాత పనులు నత్తనడక నడుస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలిచ్చి, అధికారంలోకి వచ్చిన నాయకులు ఆ తర్వాత వాటిని విస్మరిస్తుండడంతో ప్రజా సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల్లో అల్లర్లు సృష్టిస్తే కేసులు నమోదు

● డీఎస్పీ మహబూబ్ బాషా



మాట్లాడుతున్న డీఎస్పీ మహబూబ్‌బాషా

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 19: పోలింగ్ కేంద్రాల వద్ద అల్లర్లు సృష్టించేవారిపై రౌడీషీట్ తెరుస్తామని రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా హెచ్చరించారు. శుక్రవారం రాత్రి లక్కిరెడ్డిపల్లె, పాళెంగొల్లపల్లె, కస్తూరిరాజుగారిపల్లెల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. బైకులు, ఇతర వాహనాలుపై అనుమతులు లేకుండా పార్టీ జెండాలు పెడితే వెంటనే అరెస్టు చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అక్రమాలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించించేది లేదన్నారు. మే 11 వరకు ప్రచారం నిర్వహించుకోవచ్చని, ప్రచారంలో మద్యం సేవించినా, ఇతర పార్టీలను దూషించినా , అల్లర్లు జరిగినా వెంటనే అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేస్తామన్నారు. పోలింగ్ రోజు డిన్నర్లు, మద్యం క్రయాలు, డబ్బు పంపిణీతోపాటు, గుంపులుగా కనిస్తే చర్యలు తప్పవన్నారు. ఎన్నికల్లో నమోదు అయిన కేసులు జీవితాంతం ఉంటాయని, ఎన్నికలు జరిగే ప్రతిసారీ కేసు ఉన్న వ్యక్తిని అరెస్టు చేస్తారన్నారు. గ్రామాల్లో మద్యం సేవించి అల్లర్లు సృష్టిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా 100 ఫోన్ చేసి సమాచారాన్ని అందించాలన్నారు. ప్రచారంలో మద్యం కనిపిస్తే చర్యలు తప్పవన్నారు.ఈ కార్యక్రమంలోసీఐ జీవన్ గంగనాథబాబు, ఎస్ఐ విష్ణువర్ధన్ హెడ్‌కానిస్టేబుల్స్ రామ్‌ప్రసాదు, గోపినాయక్, పోలీసు సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే చర్యలు

● అనుమతి లేకుండా వాటర్ ప్లాంట్‌లు నడిపితే సీజ్ ● మున్సిపల్ కమిషనర్ వాసుబాబు



ఆర్‌వో ప్లాంట్స్ నిర్వాహకుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వాసుబాబు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 19: ప్యూరిఫైడ్ వాటర్ పంపిణీలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోయినా, అనుమతులు లేకుండా వాటర్‌ప్లాంట్స్ నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, జిల్లా ఆహార భద్రత అధికారి షమీంబాషా వాటర్ ప్లాంట్ యజమానులను హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వాటర్ ప్లాంట్స్ ఇంజనీరింగ్ కార్యదర్శులు ఆహార భద్రత సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మినరల్ వాటర్ ప్లాంట్స్ నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. అధిక ధరలకు విక్రయించినా, ప్లాంట్ల పరిసరాల్లో పరిశుభ్రత పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. ప్రతినెల తప్పనిసరిగా ఆర్‌వో ప్లాంట్స్ యజమానులు ప్రభుత్వ ల్యాబొరేటరీలో నీటి పరీక్షలు నిర్వహించి రిపోర్టు తీసుకోవాలని సూచించారు. రేపటి నుంచి పట్టణంలోని అన్ని ఆర్‌వో ప్లాంట్లలో నీటి శాంపిల్స్ సేకరించి తిరుపతిలోని ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సుధాకర్ నాయక్, ఏఈ కృష్ణారెడ్డి, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, ఆహార భద్రతా సిబ్బంది సీతారామయ్య, అన్ని వార్డుల ఇంజనీరింగ్ కార్యదర్శులు, ఆర్‌వో ప్లాంట్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

చిన్నఓరంపాడు పంచాయతీలో అరవ శ్రీధర్ ప్రచారం



ముక్కా వరలక్ష్మికి స్వాగతం పలుకుతున్న టీడీపీ అభిమానులు

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 19 : మండలంలోని చిన్నఓరంపాడు గ్రామ పంచాయతీలోని అయ్యలరాజుపల్లె గ్రామం, వడ్డిపల్లె హరిజనవాడ, ఓబులవారిపల్లె వడ్డిపల్లె గ్రామాల్లో ఎన్‌డీఏ అభ్యర్థి అరవశ్రీధర్ ప్రచారం నిర్వహించారు. మండల టీడీపీ నాయకులు పున్నాటి వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, భార్య ముక్కా వరలక్ష్మి , తనయుడు సాయి వికాస్‌రెడ్డి, కోడలు ఇంటింటిరి తిరిగి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ప్రచారం చేశారు. మ గ్రామ సర్పంచ్ కుమారుడు గద్దె పెంచలయ్య, మాజీ ఎంపీటీసీ రవీంద్రనాయుడు, ఓబిలి శ్రీనివాసులురెడ్డి, సీనియర్ నాయకులు కల్లా చలపతి, కమతం నాగరాజు యాదవ్, నాగేంద్ర నాయుడు, ప్రసాద్‌రెడ్డి, యువ నాయకులు పయ్యావుల కోటేశ్వరరావు, శివయ్యనాయుడు, గజేంద్ర నాయుడు, రాజారెడ్డి, శివారెడ్డి, బొమ్మవరం సుబ్బరాజు, జమీర్ అక్బర్, రంగనాథ్, గౌరయ్య, మహిళా నాయకురాళ్లు, అన్ని పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీకి ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి రాజీనామా?!



విలేకరులతో మాట్లాడుతున్న ముద్దా బాబుల్‌రెడ్డి

పుల్లంపేట, ఏప్రిల్ 19: వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం రాత్రి పుల్లంపేటలోని బైపాస్‌లో తన అనుచరులతో కలిసి విలేకరుల సమావేశంలో ఈ మేరకు వెల్లడించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాలతో శుక్రవారం మండలంలో ఎన్నికల ప్రచారం ప్రారంభిన్నారు. ప్రచారం ముగిసిన తర్వాత కొల్లం గంగిరెడ్డితో కలిసి ప్రచారం చేయాలని, తన నాయకత్వం బాగోలేదని కొంతమంది చెప్పారన్నారు. ఉమ్మడి జిల్లాలో కమలాపురం రవీంద్రారెడ్డి తర్వాత వైసీపీలో తానే సీనియర్ నాయకుడినని, ఇప్పటివరకు ఆస్తులు పోగొట్టుకొని జైలు పాలయ్యామన్నారు. ఇంతవరకు ఎటువంటి పదవులు పొందలేదన్నారు. తన నాయకత్వం బాగా లేదన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సస్పెండ్ చేయక ముందుగానే పార్టీ నుంచి వైదొలగుతున్నానన్నారు. నాపై ఎవరెవరో కుట్రలు చేస్తున్నారన్నారు. తనను బలహీన పరిచేందుకు తమ గ్రామంలో తమ పార్టీ నాయకులే టీడీపీకి మద్దతు తెలుపుతున్నారన్నారు. కొద్ది రోజుల తర్వాత భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు. ప్రచారం ముగిసిన తర్వాత, తిరిగి ప్రచారం చేయడం తన నాయకత్వాన్ని హేళన చేయడమేనని అందుకే ఈ రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, బొమ్మితొట్టి రాజా తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి



ప్రచార కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మల్లు నరసారెడ్డి

సంబేపల్లె, ఏప్రిల్19: కూటమి అభ్యర్థులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లు నరసారెడ్డి గడప గడపకు వెళ్లి ప్రచారం చేశారు. శుక్రవారం శెట్టిపల్లె, పాలెంగడ్డ, పాలెంగడ్డ హరిజనవాడల్లో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమన్నారు. 15 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉన్న శ్రీకాంత్‌రెడ్డి ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అవినీతి అక్రమాలే తప్ప అభివృద్ధి జరగలేదన్నారు. రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడును సీఎం చేయాలని నరేంద్రమోడీని ప్రధానిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డెయ్యయాదవ్, ఎంపీటీసీ సభ్యుడు రామరాజు, టీడీపీ నాయకులు నూరేకరాల రంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, నాగరాజ, యువరాజు, దినేశ్‌నాయుడు, నాగార్జునరెడ్డి, కొండయ్య, చిన్న, చౌదరి, ధన కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

ఓబులవారిపల్లె, ఏప్రిల్19: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. జీవీ పురానికి చెందిన పొలంనేని చంద్రయ్య భార్య ఓ బులమ్మ (40)కు కొన్నేళ్లుగా కుటుంబంతో సత్సంబంధాలు లేవు. దీంతో పెనగలూరు మండలం సాతుపల్లి హరిజనవాడలోని పుట్టినింట్లో ఉండేది. గురువారం అత్తవారింటికి వచ్చిన ఆమెతో భర్త గొడవ పడడంతో మనస్తాపం చెంది ఉరి వేసుకుని మృతి చెందింది. భర్త ఆగడాలు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతుకు శాపం!

సిద్దవటం, ఏప్రిల్ 19 : విద్యుత్ తీగలు తెగి వారం రోజులు గడిచినా మరమ్మతులు చేయకపోవడంతో మిర్చి పైరు ఎండిపోతోందని వెంకటాయపల్లెకు చెందిన నీళ్లబోయిన సుబ్బరాయుడు అనే రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ రైతు ఒక ఎకరా పొలంలో రూ. 1,50,000లు ఖర్చు చేసి మిర్చి సాగు చేశాడు. పంట చేతికొచ్చే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్తీగలు తెగిపోవడంతో పైరుకు నీరందించే అవకాశంలేకుండా పోయింది. ఈ విషయాన్ని జగనన్నకు చెబుదాం నెంబరు 10902కు కాల్ చేయగా, వారు కూడా ఏ మాత్రం స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని విద్యుత్ సౌకర్యం కల్పించాలని రైతు వేడుకున్నాడు. ఈ విషయంపై విద్యుత్ ఏఈని వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి రాలేదని సమస్య ఉంటే సమీప గ్రామ సచివాలయంలో ఫిర్యాదు చేయవచ్చునని లేదా విద్యుత్ కార్యాలయానికి వచ్చి రాతపూర్వకంగా తెలియజేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన తెలియజేశారు.

టీడీపీ, జనసేన, కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 19: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి తరఫున రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా శుక్రవారం మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ఎస్ఎన్ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో కుటుంబ సమేతంగా పూజలు చేశారు. అనంతరం తన అనుచరులతో కలసి రాయచోటి ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రంగస్వామికి ఒక సెట్టు నామినేసన్ పత్రాలను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ తరఫున డీసీసీ అధ్యక్షుడు, రాయచోటి అసెంబ్లీ అభ్యర్థి షేక్. అల్లాబకష్ తన అనుచరులతో వెళ్లి ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు.

రైల్వేకోడూరు: కూటమి బలపరిచిన జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అరవ శ్రీధర్ శుక్రవారం రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారిణి లీలారాణికి అందజేశారు. అభ్యర్థితో పాటు టీడీపీ ఇన్‌ఛార్జ్ ముక్కా రూపానందరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు కస్తూరి విశ్వనాథనాయుడు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గోశాలదేవి ఒక్క సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. ఆమె వెంట కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : అరవ శ్రీధర్ నామినేషన్ కార్యక్రమంలో తానా మాజీ సభ్యుడు, రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు వేమన సతీష్ పాల్గొన్నారు.

పెద్దజంగంపల్లిలో వైద్య శిబిరం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పెద్దజంగంపల్లె వైద్య శిబిరంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య

సంబేపల్లె, ఏప్రిల్ 19: కోరలు చాస్తున్న డెంగ్యూ శీర్షికతో ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి డీఎంహెచ్‌వో కొండయ్య స్పందించారు. పెద్దజంగంపల్లిలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి తానే స్వయంగా పర్యవేక్షించారు. జ్వరాలు రాకుండా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. జ్వర పీడితులకు రక్త నమూనాలను సేకరించి వైద్య సేవలు అందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఓపీ రిజిస్టర్‌ను, మందుల రికార్డులను పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్ పరిశీలించి కాన్పులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మలేరియా, డెంగ్యూ వ్యాధులపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, వైద్యాధికారి మధుసూదన్‌రెడ్డి, సబ్‌యూనిట్ అధికారులు జయరామయ్య, ప్రసాద్, సీహెచ్‌వో రాణి, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

లక్కిరెడ్డిపల్లె ఏప్రిల్ 19: లక్కిరెడ్డిపల్లెలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో శుక్ర వారం అగ్నిప్రమాదాల నివారణపై ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రతలు వివరించారు. అనంతరం కర పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ నీలోఫర్‌బేగం, వైద్యులు ధరణికుమార్, జీవన్‌కుమార్, వైద్యసిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రలోభాలకు తలవంచకండి



కర్ణపువాండ్లపల్లెలో ఆత్మీయ సమావేశం మాట్లాడుతున్న టీడీపీ నేత అంజనారెడ్డి

రామాపురం, ఏప్రిల్ 19: వైసీపీ నాయకులు, కార్యకర్తలు చేస్తున్న ప్రలోభాలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎవ్వరూ భయపడాల్సిన అవసరం లేదని రామాపురం మండల సీనియర్ టీడీపీ నేత ఎస్. అంజనారెడ్డి తెలిపారు. మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ కర్ణపువాండ్లపల్లెలో శుక్రవారం కర్ణప ్రరాంమోహన్ రెడ్డి స్వగృహంలో టీడీపీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ వైసీపీ నాయకులు డబ్బు, అంగబలంతో టీడీపీ కార్యకర్తలను, నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధిస్తుందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, రాయచోటి నియోజక వర్గంలో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారన్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలపైన కేసులు వేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్ణపు రాంమోహన్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, సిలేకాంపల్లి శివారెడ్డి, నాని, పట్టాభిరెడ్డి, డాక్టర్ శ్రీను, మేరా రమణయ్య యాదవ్, కొవ్వూరు విజయభాస్కర్‌రెడ్డి, నందలూరు భాస్కర్‌రెడ్డి, కర్ణపు యోగ, నాగిరెడ్డి, గంగిరెడ్డి, దండే శ్రీనివాసులు, కొవ్వూరు లక్ష్మిరెడ్డి, కర్ణ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ఓటుపై ప్రజలకు అవగాహన



మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పిస్తున్న అధికారులు, విద్యార్థులు

చిట్వేలి, ఏప్రిల్19 : ఓటు హక్కు మన జన్మ హక్కు అని ఓటుపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో రంగారావు, ఎంఈవో కోదండ నాయుడు తెలిపారు. ు శుక్రవారం కె.కందులవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ఎంపీడీవో, ఎంఈవో అవగాహన కల్పించారు. మానవహారం ఏర్పాటు చేసి ఓటు హక్కు.. మన జన్మ హక్కు అంటూ నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 ఈశ్వరయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 19: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని శ్రీనివాస ఐటీఐ కళాశాలలో ఎస్ఎఫ్ఐ అన్నమయ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ నాయకులపై చేసిన దాడిని మతోన్మాద ఏబీవీపీని మట్టి కరిపిం చాలన్నారు. వామపక్ష, ఎస్ఎఫ్ఐ, విద్యార్థి సంఘాల గెలుపును జీర్ణించుకోలేక మతో న్మాద ఏబీవీపీ నాయకులు దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. యూనివర్సిటీలు దాడు లను ప్రేరేపించడం సిగ్గుచేటన్నారు. ఏబీవీపీని నిషేధించాలన్నారు. యూనివర్సిటీల్లో యుద్ధ వాతావరణ ప్రేరేపించిన ఏబీవీపీని విద్యార్థులు, ప్రొఫెసర్లు, నాన్ టీచింగ్ స్టాఫ్ తిరస్కరించాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాయచోటి పట్టణ నాయకు లు తంగెళ్ల నరేశ్‌బాబు, పెద్దిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి, సాయి, చందు, సోను, భారత్, రమణ తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ టీడీపీలో చేరిక

సంబేపల్లె, ఏప్రిల్ 19: సంబేపల్లె మాజీ సర్పంచ్ ఎన్. ప్రభాకర్‌రెడ్డి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. శుక్రవారం తన స్వగృహంలోటీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో సంబేపల్లె, రౌతుకుంట గ్రామ నాయకులతో కలిసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీలో నాయకులకు, కార్యకర్తలకు గౌరవం లేదన్నారు. ఐదేళ్ల కాలంలో గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. వైసీపీ గెలుపు కోసం కష్టపడ్డ వారికి గుర్తింపు లేదన్నారు. తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నమ్మి తెలుగుదేశం పార్టీలో చేరినట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


HAPPY BIRTHDAY "CBN" SIR
April 20 2024
జన్మదిన శుభాకాంక్షలు
HAPPY BIRTHDAY "CBN" SIR
నాయకత్వ స్ఫూర్తి దినోత్సవం
Save Nation - Save Democracy
ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పరితపిస్తూ,
ప్రజల తరపున అనేక పోరాటాలు చేస్తూ..
ప్రజలతోనే నా జీవితం, ప్రజలలోనే నా జీవనం అనే నినాదంతో
ముందుకు సాగుతున్న "మన డైనమిక్ లీడర్"
మాన్యశ్రీ గౌ॥ నారా చంద్రబాబు నాయుడు గారికి
జన్మదిన శుభాకాంక్షలు
కొండా నరేంద్ర
KONDA NARENDRA, M.S. (USA)
పారిశ్రామిక వేత్త, సామాజిక వేత్త, మానవతా వాది
తంబళ్లపల్లె నియోజకవర్గం

తుపాకి కాల్పుల కేసులో నిందితుడు అరెస్టు

గుర్రంకొండ, ఏప్రిల్ 19:భూతగాదా విషయంపై తమ్ముడిపై నాటు తుపాకీతో అన్న కాల్చిన కేసులో నిందితుడ్ని శుక్రవారం అరెస్టు చేసినట్లు వాల్మీకీపురం సీఐ పులిశేఖర్ తెలిపారు. మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీ ఎగువహరిజనవాడకు చెందిన బాలపోగుల జయప్ప, విశ్వనాథ్‌లకు భూతగాదాలున్నాయి. ఈ క్రమంలో భూమి విషయం అన్నదమ్ములు గొడవపడి తమ్ముడు విశ్వనాథ్‌పై అన్న జయప్ప నాటు తుపాకీతో ఈ నెల 16న కాల్పులు జరిపాడు. దీంతో విశ్వనాథ్‌కు రక్తగాయాలైనవి. ఈ క్రమంలో నిందితుడు జయప్ప పరారీలో ఉన్నాడు. జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు వాల్మీకీపురం సీఐ పులిశేఖర్ ఆధ్వర్యంలో గుర్రంకొండ ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి ప్రత్యేక బృందంగా ఏర్పడి కలిచెర్ల-కేశాపురం మార్గంలోని ఉదారివాండ్లపల్లె క్రాస్ వద్ద నిందితుడ్ని పట్టుకున్నారు. అతని వద్ద నుంచి నాటు తుపాకీని స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో నాటు తుపాకీలను కలిగిన వారు స్వచ్ఛందంగా పోలీసులకు అప్పగించాలని అలా కాకుండా పోలీసులకు పట్టుబడితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆశాలను వేధిస్తున్న అధికారిపై చర్యలు తీసుకోవాలి


ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 19:కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ ఆశాలకు అక్రమంగా మెమోలు ఇస్తున్న అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్ మెడికల్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మెడికల్ ఆఫీసర్ వేధింపులకు నిరసనగా శుక్రవారం యూపీహెచ్‌సీ ఎదుట ఆశాకార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు నమస్కారం చేయలేదన్న కక్షతో అక్రమంగా ఆశా కార్యకర్తలపై మెమోలు జారీచేయడంతోపాటు వాట్సప్ గ్రూప్‌లో పెట్టి వారిని భయభ్రాంతులకు గురి చేశాడని ఆరోపించారు. ఆశాలపై వేదింపులు ఉండకుండా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల పట్టించుకోని మెడికల్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశాకార్యకర్తలు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్షకు సర్వం సిద్ధం

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 19 : పీటీఎంలోని ఆదర్శ పాఠశాలలో ఈ నెల 21వతేదీన జరగబోవు 6వ తరగతి ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లు సర్వం సిద్ధం చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ విద్యార్థులందరూ 21న ఉదయం 9 గంటలకు ఆదర్శ పాఠశాలకు చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు మజ్జిగ భోజన వసతి ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ తరగతుల వరకు అడ్మిషన్ పొందవచ్చని ఆమె వివరించారు.

నిమ్మనపల్లిలో: మండలంలోని రెడ్డివారిపల్లిలో మోడల్ స్కూల్‌లో 6వతరగతి ప్రవేశానికి ఈ నెల 21జూ (ఆదివారం) ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సత్య నారాయణమూర్తి తెలిపారు. మండల పరిధిలోని విద్యార్థులు 5వతరగతి పాసై వుండి ఆన్‌లైన్ ద్వారా మోడల్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకొన్న విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరు కావాలన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా వారి హాల్‌టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరు కావాలన్నారు. ఆదివారం ఉదయం10గంటల నుంచి 12గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలలో మంచి మార్కులతో పాసైన వారిన ఎంపిక చేయన్నుట్లు తెలిపారు.

అట్టహాసంగా జయచంద్రారెడ్డి నామినేషన్

● అడుగడుగునా బ్రహ్మరథం ● జనంతో నిండిపోయిన తంబళ్లపల్లె రహదారులు ● భారీగా తరలివచ్చిన కూటమి శ్రేణులు


నామినేషన్ దాఖలు చేస్తున్న ఉమ్మడి అభ్యర్థి సతీమణి కల్పనరెడ్డి


నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన ప్రజలు, నాయకులు

ములకలచెరువు, తంబళ్లపల్లె, ఏప్రిల్ 19: తంబళ్లపల్లె నియోజవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి శుక్రవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. సందర్భంగా నియోజకవర్గ కేంద్రమైన తంబళ్లపల్లెలో జన ప్రభంజనం కన్పించింది. ములకలచెరువు పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా జయచంద్రారెడ్డి ఉదయం నామినేషన్ దాఖలు చేసేందుకు బయలుదేరారు. దారి పొడుతునా ప్రజలు, కూటమి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ములకలచెరువు - తంబళ్లపల్లె రోడ్డు జనం, వాహనాలతో నిండిపోయింది. అడుగడుగునా ప్రజలు జయచంద్రారెడ్డికి బ్రహ్మరథం పట్టారు. నామినేషన్ దాఖలు చేసేందుకు జయచంద్రారెడ్డితో పాటు నియోజకవర్గ ప్రచార సమన్వయ కర్త సీడు మల్లికార్జున నాయుడు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రయాదవ్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, టీడీపీ నేత మంత్రి గిరిధర్‌రెడ్డి, బీజేపీ నేత గోపాల్‌రెడ్డి తదితరులు వెంట వెళ్లారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాఘవేంద్రకు నామినేషన్ పత్రాలు అందజేశారు. అలాగే జయచంద్రారెడ్డి సతీమణి కల్పనరెడ్డి కూడా నామినేషన్ దాఖలు చేశారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో జయచంద్రారెడ్డి పూజలు

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 19: పీటీఎం మండలంలోని బూచిపల్లెలో వెలసిన శ్రీదేవి బూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో శుక్రవారం తంబళ్లపల్లె నియోజక వర్గ కూటమి అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి ఆయన సతీమణి కల్పనారెడ్డిలు ప్రనత్యేక పూజలు చేశారు. బూచిపల్లె మాజీ సర్పంచ్ కేశవ, ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయనకు స్వాగతం పలికారు.

అట్టహాసంగా షాజహాన్‌బాషా నామినేషన్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 19: మదనపల్లె టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా టీడీపీ శ్రేణులతో కలసి వెళ్లి అట్టహాసంగా నామినేషన్ వేశారు. శుక్రవారం తన నివాసం నుంచి ర్యాలీగా బయలు దేరారు. సమయం 2 కావస్తుండటంతో ద్విచక్రవాహనంపై సబ్ కలెక్టరేట్‌కు చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ సీనియర్ నేత మార్పూరి సుధాకర్ నాయుడు, విద్యాసాగర్, శివప్రసాద్, నాదెళ్ల శివన్న, ఎస్‌ఏ మస్తాన్, జనసేన నాయకుడు జంగాల శివరామ్ నేతలు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెను దోచుకుని ఎడారిగా మార్చారు

● ఇంతటి ఆదరణ చూపిన ప్రతి ఒక్కరికి జీవితాంతం రుణపడి ఉంటా
● తంబళ్లపల్లె కూటమి ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, తంబళ్లపల్లె, ఏప్రిల్ 19: వైసీపీ ఐదేళ్ల పాలనలో తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని దోపిడీ చేసి ఎడారి ప్రాంతంగా మార్చారని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన తరువాత ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎక్కడ చూసినా ఇసుకను అనుమతులకు మించి తీసేసి భూగర్భజలాలు అడుగంటేలా చేసి రైతాంగాన్ని నడిరోడ్డుపై పడేశారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు లేకుండా చేసి రాష్ట్రాన్ని డ్రగ్ అంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. నియోజకవర్గ చరిత్రలో ఎన్నిడూ లేని విధంగా ఇక్కడ కూడా డ్రగ్స్ దొరుకుతు న్నాయంటే ఈ పాలకులు ఎంతకు దాగజారారో అర్థమతుతోందన్నారు. ఖచ్చితంగా రైతులను ఆదుకుని యువకులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గానికి పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తానన్నారు. రైతులను రాజులుగా చేసేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు తీసుకొస్తామన్నారు. తనతో పాటు రాజంపేట ఎంపీ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డికి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. నామినేష న్ కార్యక్రమానికి వచ్చి ఇంతటి ఆదరణ చూపిన ప్రజలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారులకు జీవితంతం రుణపడి ఉంటానన్నారు. ప్రతి ఒక్కరికి పేరు పేరునా పాదాభివందనం చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పర్వీన్‌తాజ్, నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రయాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, రెడ్డప్పరెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కువైట్ శంకర్ తదతరులు పాల్గొన్నారు.

మరో సెట్ నామినేషన్ దాఖలు చేసిన అమర్

పీలేరు, ఏప్రిల్ 19: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి తనయుడు నల్లారి అమరనాథరెడ్డి శుక్రవారం మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. సతీమణి షమారెడ్డితో కలిసి పీలేరు తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్న ఆయన తన నామినేషన్ పత్రాలు పీలేరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌కు అందజేశారు.

రెండో రోజు రెండు నామినేషన్లే

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 19:నామినేషన్ల పర్వం రెండో రోజున మదనపల్లె నియోజకవర్గం నుంచి రెండు నామినేషన్లే దాఖలు అయ్యాయి. శుక్రవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషాతోపాటు మదనపల్లె పట్టణానికి చెందిన ఎం.భాస్కర్ స్వతంత్ర్య అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. వన్‌టౌన్, టు టౌన్, తాలూకా సీఐలు వల్లీబషు, యువరాజు, శేఖర్, ట్రాఫిక్ సీఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అశ్వ వాహనంపై పట్టాభిరాముడి వైభవం


అశ్వ వాహనంపై పట్టాభిరాముడి నగరోత్సవం

వాల్మీకిపురం, ఏప్రిల్ 19: వాల్మీకిపురం పట్టాభిరాముడి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం అశ్వవాహనంపై పురవీధుల్లో ప్రజలను కటాక్షించారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, మూలవర్లకు అభిషేకం, తోమాలసేవలతో విశేష పూజలు జరిగాయి. భోగోత్సవ మూర్తులైన సీతారామలక్ష్మణులకు విశేష అలంకరణలతో తిరుచ్చిలో వేంచేపు చేసి తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం సాయంత్రం పట్టాభిరాముడికి ఊంజల్‌సేవ కన్నుల పండుగగా నిర్వహించారు. రాత్రికి అశ్వ వాహనంపై పట్టాభిరాముని విశేషాలంకరణలతో అధిష్టింపచేసి పురవీధులలో నిర్వహించిన నగరోత్సవం వైభవంగా సాగింది.ఈసందర్భంగా కోలాటలు, చెక్కభజనలు, మహిళల చలిపిండి దీపారాధనలు, టీటీడీ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్,సూపరింటెండెంట్ వెంకటస్వామి,ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారులు కృష్ణమూర్తి,నాగరాజ్లు,అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, కృష్ణప్రసాద్, కృష్ణరాజు, భాషికాచార్యులు, రామ్‌గోపాల్ బృందం, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలలో నేడు...పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రికి హంస వాహనంపై పట్టాభిరాముడి నగరోత్సవం, ధ్వజాఅవరోహణ కార్యక్రమాలు జరగనున్నాయి.

బీసీలను వంచించడం తగదు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 19:బీసీలను రాజకీయంగా వంచించడం తగదని బీసీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బోడెంరాజశేఖర్ అన్నారు. శుక్రవారం బీసీల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల మద్దతు ఉంటేనే ఎవ్వరైనా గెలవడానికి సాధ్యమన్నారు. బీసీల మద్దతుతో ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల్లో .బీసీలు ఆదేశిస్తే స్వతంత్ర అభ్యర్థిగా నిలబడడానికి వెకాడనని తెలిపారు. కార్యక్రమంలో నాగినేని గోవిందు, రామలింగయ్య, చినరెడ్డి, పారేసి రాజగోపాల్, వెంకటేష్‌యాదవ్, శేఖర్‌నాయుడు, సతీష్, బండిరామచంద్ర, రమణ, ఖాదర్‌వల్లి, రామకృష్ణస్వామి, మేకల లక్ష్మీనారాయణ, అశోక్, నగేష్, రాజకుమార్, మనోహర్, అమానుల్లా, చంద్ర, శ్రీనివాసులు, మెహన్, తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె కాంగ్రెస్ అభ్యర్థిగా బీఫాం అందుకున్న చంద్రశేఖర్ రెడ్డి

బి.కొత్తకోట, ఏప్రిల్19: తంబళ్లపల్లె యోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంఎన్ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం పార్టీ బీఫాం ను అందుకున్నారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల ఇటీవల ప్రకటించిన జాబితాలో చంద్రశేఖర్‌రెడ్డికి చోటు దక్కింది. అధినేత నుంచి పిలుపు రావడంతో న్యాయయాత్రలో భాగంగా అనంతపురం జిల్లా గుంతకల్లులో పర్యటిస్తున్న షర్మిలను కలిశారు. ఆమె సంతకంతో కూడిన బీఫాం అందిస్తూ కాంగ్రెస్ సాంప్రదాయ ఓటుబ్యాంకు అయిన ముస్లిం, ఎస్సీ, ఎస్టీల ఓట్లు రాబట్టేందుకు ప్రయత్నించాలని సూచించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల22న నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. షర్మిల రాకతో కాంగ్రెస్ గ్రాఫ్ పెరిగిందని ఈ నెల16 బి కొత్తకోటలో ఆమె సభకు ప్రజలనుంచి విశేష స్పందన లభించిందన్నారు.

మైనారిటీల సంక్షేమమే కూటమి లక్ష్యం


కలకడలో పథకాలను ప్రజలకు వివరిస్తున్న కిశోర్‌కుమార్‌రెడ్డి


పీలేరులో ప్రచారం చేస్తున్న నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి కోడలు షమా రెడ్డి

కలకడ, ఏప్రిల్ 19:మైనారిటీ సంక్షేమమే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి లక్ష్యమని పీలేరు కూటమి ఉమ్మడి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన నాయకులతో కలిసి కలకడ పట్టణంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా కరపత్రాలను అందజేసి కూటమి ఉమ్మడి పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన సోదరుడు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో మైనారిటీలకు అనేక సౌకర్యాలు కల్పించినట్లు గుర్తు చేశారు. అదే విధంగా చంద్రబాబునాయుడు హయాంలో విరివిగా పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. వైసీపీ పాలనలో మైనారిటీలకు లబ్ధి చేకూరే పథకాలను రద్దు చేసి పొట్టకొట్టారని విమర్శించారు. తమ హయాంలో పేదలకు వేలాదిగా కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయగా ఈ ప్రభుత్వంలో ఒకరికైన లబ్ధి చేకూరిందో లేదో ఆలోచించుకోవాలన్నారు. గాడితప్పిన రాష్ట్ర భవిష్యత్‌ను దారిలో ఉంచేందుకు ఓటర్లు కూటమికి పట్టంకట్టాలని కోరారు. కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారపు రవిప్రకాశ్, అధికార ప్రతినిధి సూర్యప్రకాశ్, బీజేపీ కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్, నాయకులు బరకం శ్రీనివాసులరెడ్డి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, మద్దిపట్ల వెంకటరమణనాయుడు, మల్లికార్జుననాయుడు, కాంతారావు, తిరుపతినాయుడు, బీవీస్వామి, చంద్రమోహన్, త్యాగరాజు, రైస్‌మిల్ రమణ, తారకేశ్వర, మునాఫ్, షబ్బీర్‌అహ్మద్, కరీముల్లా, జిలానీ, ఇనాయతుల్లా, ఇర్ఫాన్, ఖాజా, నౌషాద్, ఇమ్రాన్, అలీ, జాఫర్, మున్వర్, రెడ్డెప్పలు పాల్గొన్నారు.

తొలిసారిగా ప్రచారంలో పాల్గొన్న కిశోర్ కోడలు

పీలేరు, ఏప్రిల్ 19: ఎన్నికల నేపథ్యంలో పీలేరు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డికి మద్దతుగా ఆయన కోడలు షమారెడ్డి శుక్రవారం పీలేరులో జరిగిన టీడీపీ ఇంటింటి ప్రచారంలో తొలిసారిగా పాల్గొన్నారు. కిశోర్ కుమార్‌రెడ్డి సతీమణి నల్లారి తనూజారెడ్డి గత కొంత కాలంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉధృతంగా ప్రచారం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆమె గత మూడు రోజులుగా పీలేరు పట్టణంలోని మదనపల్లె టర్నింగ్ ప్రాంతంలో భర్త గెలుపు కోసం ప్రచారం చేస్తున్నారు. వారి కుమార్తె వైష్ణవీ రెడ్డి కూడా ప్రచారంలో పాల్గొన్నారు. అయితే వారి కోడలు షమారెడ్డి తొలిసారిగా శుక్రవారం ప్రచారంలో పాల్గొన్నారు. మదనపల్లె మార్గంలోని జేకే నగర్, కామాటంపల్లె ప్రాంతాల్లో అత్తాకోడళ్ల ప్రచారం చేస్తున్నారన్న విషయం తెలియడంతో స్థానికులు వారిని కలిసేందుకు పెద్దఎత్తున వీధుల్లో బారులు తీరారు. వారందరికీ కరపత్రాలు అందజేస్తూ ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డిని, ఎంపీగా నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. అలాగే స్థానిక బోడేషావలి దర్గాలో శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని తమ కుటుంబసభ్యులు విజయం కోసం దువా చేశారు. దువా అనంతరం అక్కడున్న వారందరికీ ప్రసాదం అందజేశారు. తనతో సెల్ఫీలు తీసుకునేందుకు పలువురు యువతులు అడగడంతో వారందరితో ఆమె సెల్ఫీలు దిగారు.

80 లీటర్ల సారా స్వాధీనం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 19: అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్న మహిళపై కేసునమోదు చేసి 80 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తాలూకా పోలీస్‌స్టేషన్ సీఐ శేఖర్ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు మదనపల్లె మండలం, కొత్తయిండ్లుకు చెందిన మునెమ్మ(30) నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారంతో రూరల్ పోలీసులు వెళ్లి ఆమెను అరెస్టు చేసి 80 లీటర్లు సారాను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వాల్మీకిపురం, ఏప్రిల్ 19: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తంగా ఉండాలని వాల్మీకిపురం అగ్నిమాపక కేంద్ర అధికారి మస్తాన్ పేర్కొన్నారు. వారోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో అగ్ని ప్రమాదాల నివారణ, జాగ్రత్తల పట్ల ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఫైరోజాబేగం, డాక్టర్లు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కోదండ రామస్వామి తిరుణాల

కురబలకోట, ఏప్రిల్ 19: మండలంలోని కురబలకోటలో వెలసిన కోదండరామస్వామి తిరుణాలను రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం రాత్రి కల్యాణోత్సవం, గరుడోత్సవం ఆదివారం రథోత్సవాన్ని నిర్వహించనున్నామన్నారు.

రేపు కుంభాభిషేకం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 19: స్థానిక దండుమారెమ్మ, కోదండ రామస్వామి ఆలయంలో ఈనెల 21న కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ సమితి సభ్యులు బి. రెడ్డిశేఖర్, జి.ప్రసాద్, పి, మల్లికార్జున, జిసుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం భక్తులకు రెడ్డెప్ప ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కుంభాభిషేకాన్ని విజయవంతం చేయాలన్నారు.



